


# ఇంటి దీపం

పాలకోడేటి సత్యనారాయణరావు

"ఏమండీ, మాట!"

కృష్ణమూర్తి వేయబోతూన్న అడుగును వెనక్కు లాక్కుంటూ వెనుతిరిగి చూశాడు. కృష్ణమూర్తికేసి చూడకుండా అటెటో చూస్తూ నిలబడింది జ్యోతి.

"ఏమిటి సంగతి!" ముఖంలో విసుగును స్పష్టంగా ప్రకటిస్తూ అడిగాడు కృష్ణమూర్తి. "ఎన్నిసార్లు చెప్పాను నీకు!"

"ఔను, చాలాసార్లే చెప్పారు కాదనను, కానీ..."

"వెనక్కు పిలవటం నీకు అలవాటు. ఇంతకీ సంగతి చెప్పావుకావు!"

"ఆ వెధవ ఉత్తరాన్ని జేబులోనే పెట్టుకొని తిరగాలా ఏం!"

కృష్ణమూర్తికి ఒళ్లు మండిపోయింది.

"జ్యోతీ, నీకు ఒళ్లు పొగరెక్కిపోయిందన్న సంగతి నాకు గుర్తుచేస్తున్నావా ఏం!"

"అవును! ఆ ఉత్తరం మీ జేబులో ఉన్నంతకాలం నా ఒంటిమీద తేళ్లూ, జెర్రులూ పాకుతూనే ఉంటాయన్న

సంగతి గుర్తుంచుకోవటం మరీమంచిది!" జ్యోతి నిర్లక్ష్యంగా, మరీ స్పష్టంగా తన మనసులోని మాటను పైకే అనేసింది. కృష్ణమూర్తికి కోపం పెరిగిపోయింది. క్షణం తన్ను తాను సంబాళించుకొంటూ అన్నాడు: "జ్యోతీ, నా పర్సనల్ విషయాలలో జోక్యం కలిగించుకోవటం అంత ఆరోగ్యకరమైన సంగతికాదు!"

"జోక్యం కలిగించుకోక పోతే, నిజంగా ఆరోగ్యకరం కాదుకాబట్టే కలగ జేసుకొంటున్నాను."

జ్యోతి ఇంకా ఏదో అంటున్నా వినకుండా, ఆమాటల్ని కట్ చేస్తూ అన్నాడు కృష్ణమూర్తి: "బాగా గుణపాఠం నేర్పుతున్నావు జ్యోతీ నువ్వు! ఆవేళ ఇంట్లో అందరూ చెబుతున్నా వినకుండా, చదువుకొన్నదానివనీ, తెలివైనదానివనీ చేసుకోవటం నేను చేసిన బుద్ధితక్కువ పనిఅని ఎంతస్పష్టంగా చెబుతున్నావ్!"

జ్యోతి మనసు కష్టపడింది.

క్షణం ఆగి అంది: 'నేనూ అదే అనుకొంటున్నాను! నేను జీవితంలో చేసిన తెలివితక్కువ పనేదైనా ఉంటే, అది మిమ్మల్ని చేసుకోవటమే!"

కృష్ణమూర్తికి షాక్ తగిలినట్లయింది. క్షణం జ్యోతికేసి అసహ్యం నిండిన చూపుల్తో చూసి బయటకు నడిచాడు. భర్త అంత నిర్లక్ష్యంగా తన్నుచూడటం, ఆ చూపుల్లో అసహ్యాన్ని కూడా జత చేయటం చూసి జ్యోతికి ఏడుపొచ్చింది. 'లవ్ మీన్స్ నెవర్ హావింగ్ టు సే యూ ఆర్ సారీ!'—జ్యోతికి ఈమాట గుర్తుకొచ్చి బాధ మరింతఎక్కువయింది.

'అయిపోయింది. అంతా అయిపోయింది!' అనుకొంది మనసులో. 'నా పర్సనల్ విషయాలు!' — పెళ్లయిన మూడేళ్లకుకూడా ఇంకా 'పర్సనల్' విషయాలున్నాయంటే అంతకన్నా సిగ్గుపడాల్సిన విషయం ఇంకా ఏముంది? తన్ను తీయనిమాటలతో, అందమైన కథలతో వలలోవేసుకుని ఈవేళ మోసం చేయబోతున్న భర్తను తలచుకొని, మంచంమీదపడి, తనివితీర ఏడ్చిఏడ్చి నిద్రలోకి జారుకొంది జ్యోతి.

నిద్రలో — తనూ, కృష్ణమూర్తీ కలిసి కట్టుకొన్న మేడలన్నీ పునాదులతోసహా క్షణాలమీద కూలిపోతున్నట్లుగా కలగంది జ్యోతి. కలరావటంతో ఉలికిపడి లేచింది జ్యోతి.

* * *

'ఛీ, ఛీ. వీళ్లకసలు బుద్ధిలేదు!' అనుకొన్నాడు కృష్ణమూర్తి ఇంట్లోంచి బయటకు రాగానే. 'ఆడదీ, అనుమాన స్వరూపిణీ!' అనీ అనుకొన్నాడు.

ఇంతకీ తను చేయరాని మహాపరాధం ఏంచేశాడు గనుక? తనకు వచ్చిన ఉత్తరాన్ని 'మీకో ఉత్తరం వచ్చిందంటూ అందించింది జ్యోతి నిన్న మధ్యాహ్నం. ఉత్తరం చదువుకొన్న తర్వాత కృష్ణమూర్తికి నవ్వొచ్చింది.

కృష్ణమూర్తికి అలాటి ఉత్తరం రావటం కొత్తకాదు. అప్పటికే అతనెన్నో ఉత్తరాలు—ఇంత అందమైనవీ, ఇంకా ఎంతో ఆకర్షణీయమైనవీ — అందుకో గలిగాడు. ఒక్కో ఉత్తరం అతన్ని చేరి నపుడెల్లా అతనికి దేశం అంటే జాలి అధికమయ్యేది. ఆడవాళ్లంటే సాను భూతి కలిగేది.

ఎప్పటికి ఎదుగుతారు ఈ అమాయ కులు?

ఎప్పటికి వీళ్లల్లో జ్ఞానోదయం కలుగుతుంది??

—ఈసారి కృష్ణమూర్తిలో ఆవే ఊహలు చెలరేగాయి. కానీ ఈ ఉత్తరం మిగతా అన్ని ఉత్తరాలకన్నా అందంగా కనబడింది. దానికి కారణం—ఆ ఉత్త రంతోబాటుగా వచ్చిన ఆ ఫొటోయే!! ఉత్తరాన్ని టేబుల్ మీద పెట్టిస్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తున్నంతసేపూ, ఉత్తరాలలో అక్షరాలు తనతో దోబూచు లాడుతున్నట్లుగా అనిపించింది. అంద మైన ఆడపిల్లలు తన్ను ఆదమరచి కౌగ లించుకొన్నట్లుగా అనిపించింది. వంటికి మెత్తగా ఏదో తగిలితే కళ్లు తెరిచిచూస్తే అతని వంటికి అంటుకొనిఉన్న సబ్బు నురగ కనబడింది. సిగ్గుపడుతూస్నానం కానిచ్చాడు కృష్ణమూర్తి. స్నానంనుంచి తిరిగిరాగానే తను వెళ్తున్నప్పుడు టేబిల్ మీద పడేసిన ఉత్తరం అతన్ని వెక్కి రిస్తూ కనబడింది. వెంటనే తీసి మడత పెట్టి, జేబులో పెట్టుకొన్నాడు అతను దాన్ని. ఆసంగతి గమనించిందికాబోలు, జ్యోతి ఆఫీసుకు బయలుదేరేటప్పుడు గొడవపడింది.

ఆఫీసులో కూర్చున్నాడే కానీ, ఇంటి నుంచి వచ్చేటప్పుడు జ్యోతిఅన్నమాటలే గుర్తుకు రాసాగాయి. ఎంతేసి మాటలు ఎంత తేలికగా అనేసింది!—'తను జీవి తంలో చేసిన తెలివితక్కువపని ఏదైనా అంటూ ఉంటే, అది మిమ్మల్ని చేసు కోవటమే...'

క్షణం తర్వాత అనిపించింది కృష్ణ మూర్తికి—అనవసరంగా తనూ ఆ ఉత్త రానికి ప్రాముఖ్యతనిచ్చి జ్యోతితో గొడవపడ్డాడేమోనని. అయినా ఒక ఉత్తరం...ఒకటంటే ఒకే ఉత్తరం తన కుటుంబాన్ని, తన జీవితసౌధాన్ని పునాదులతోసహా ఇంత తీవ్రంగా కదప గలగటం కృష్ణమూర్తి ఊహించని విషయం. తన సంసారం ఇంత పేల వంగా, ఇంత బలహీనంగా ఎలా ఉంటుందో అనీ ఆశ్చర్యంపోయాడు కూడాను!

జ్యోతి—తన జీవితానికి, ఆశలకూ జ్యోతి. అలాటి జ్యోతిని ఈవేళ అన్ని మాటలు అనేసినందుకు క్షణం కించ పడ్డాడు. జ్యోతికూడా ఎలా ఉండేది, ఎలా అయిపోయింది...

* * *

రాజాబహద్దూర్ వెంకట్రామరెడ్డిగారి విగ్రహం ఆ కూడలిలో రేయింబవళ్లు కాపలా కాస్తుంటుంది. ఆయన నెత్తిమీద రాత్రిపూట ఒక దీపం వెలుగుతుంటుంది. పగటిపూట పిచ్చుకలు కాపురం ఉంటుంటాయి. ఆ కూడలికి అటుపక్కన పోలీస్ స్టేషన్, ఇటుపక్క ఓ సినిమాటాకీసూ ఉన్నాయి. ఆ సినిమాటాకీసులో అపుడో బ్రహ్మాండమైన తెలుగు సినిమా ప్రదర్శింపబడుతోంది. ఆ సినిమా ప్రజాభిమానాన్ని అధికంగా కొల్లగొడుతోందని పత్రికలన్నీ ఘోషపెడుతున్నాయి. ఆ క్షణంలో వెండితెరమీద ఓ నలభైఏళ్ల కాలేజీ కుర్రాడు, ఓ ముప్పైఏళ్ళ హైస్కూలు చదివే అమ్మాయితో ఊటీ కొండలమీద ఒక క్షణం, హార్సిలీహిల్స్ మీద మరోక్షణం, రెడ్‌హిల్స్‌మీద ఇంకో క్షణంలో చాలా ముచ్చటగా, ముద్దొచ్చేటట్టుగా అందమైనగొడవపడుతున్నాడు. ఇంకా ఒళ్లుమండిపోయింది కాబోలు— పాటకూడా అందుకొన్నాడు.

కృష్ణమూర్తికి స్వతహాగా ఇలాటి సినిమాలంటే గిట్టవు. ఇలాటి సినిమాల్లో మూడు గంటలు గడపటంకన్నా మూడేళ్లు అండమాన్స్‌లో గడపటం తేలిక అనేది అతని అభిప్రాయం. పొరబాటున ఎపుడైనా వెళ్లినా, హీరో పాట అందుకోగానే, హాల్లోంచి బయట కొచ్చి, అరగంట తర్వాత లోపలికి వెళ్లటం రివాజు.

కానీ కృష్ణమూర్తి ఈ రోజున అలా చేయలేదు.


దానికి కారణం ఆ రోజున కృష్ణమూర్తి పక్కన ఓ అందమైన దీపం కూర్చుని ఉంది. ఆ దీపంవల్ల ఇన్నేళ్ల చీకటిగాఉన్న కృష్ణమూర్తిమనసు కొకసారి వెయ్యి కాండిల్సు వెలుగువచ్చింది. అతనికి ఒకగంటక్రితంవరకూ ప్రపంచం అంతా చీకటిగా ఉండేది. ఇపుడు-ఇన్నేళ్లూ ప్రపంచంలో ఉన్న దీపాలను తానే సరిగాపట్టించుకోనట్లు తోచసాగింది. పాతికేళ్ల జీవితం ఎంతో నిస్సారంగా బీడులా ఉండిపోయింది. ఇన్నాళ్లకి దీపం చిందించిన వెలుగులవల్ల ఎంతో అందంగా కనబడసాగింది. ఈ రోజునుంచీ ఇక అతనికి రోజూ దీపావళే అనిపించసాగింది.

కృష్ణమూర్తి పక్కనున్న దీపం పేరు జ్యోతి. ఆ జ్యోతి కృష్ణమూర్తి చేతిని తన చేతుల్లోకి తీసుకొని సున్నితంగా నొక్కుతూ అంది. "నాకు చాల సంతోషంగా ఉంది."

కృష్ణమూర్తికి నవ్వొచ్చింది. ఆపుకొంటూ అన్నాడు, "ఎందుకు ?"

"ఎందుకంటే, నా జీవితంలో నా కిది ఎంతో ముఖ్యమైన రోజు. మిమ్మల్ని కలుసుకోవాలననేది నాకున్న కోరికల్లో ముఖ్యమైనది. నాకోరిక ఈరోజున..."

కృష్ణమూర్తి మనసులోని కోరికా అదే - అందమైన అమ్మాయితో ఒంట




రిగా జీవితంలో కొన్ని అందమైనక్షణాలు గడపాలనేది అతని కెప్పటినుంచో ఉన్న కాంక్ష. సువర్ణావకాశం తనంతట తానుగా వెతుక్కుంటూ ఈవేళ కృష్ణమూర్తి మనసును తట్టి పిలిచింది. కృష్ణమూర్తి జవాబు పలికాడు.

"ఏమీ మాట్లాడటం లేదేం మీరు?" అంది జ్యోతి.

"ఏం మాట్లాడమంటారు?" మాటలు పేర్చుకొంటూ కృష్ణమూర్తి అడిగాడు.

"మీకు నేను చెప్పాలా? మంచి పేరున్న రచయితలు మీరు. మీకు మాట్లాడటమెలాగో నేను చెప్పాలా?"

"ఔను, కృష్ణమూర్తి అన్నది మంచి పేరే!"

జ్యోతి నవ్వింది. జ్యోతి నవ్వులో రాలిన ముత్యాల్ని కొన్నిటిని భద్రంగా దాచుకొన్నాడు కృష్ణమూర్తి. క్షణం ఆగి అన్నాడు, "కథలు వేరు, జీవితం వేరు!"

"నేనలా అనుకోను! మీ కథలన్నీ జీవితంలోంచే ఏరుకొంటారనుకొంటాను. మనసును హత్తుకొనే విధంగా ఎలా రాయగలుగుతున్నారో అనే ఆలోచిస్తూ ఉంటాను. కొన్ని కథలు నాకెలా అనిపిస్తాయో మీకేం తెలుసు? — నన్ను అంటే నన్నే — వ్యక్తిగతంగా నన్ను దృష్టిలోపెట్టుకుని రాశారు అనిపిస్తుంటుంది!"

"కానీ మీతో పరిచయం ఈరోజే గదా!"

"కాదనను. కానీ నా మనసులోని మాట చెబుతున్నా గదా. మీతో పరిచయం కలిగించుకోవాలనీ, మీతో మాట్లాడాలనీ, నా కెన్నాళ్లనించి ఉన్న కోరికో మీకేం

తెలుసు? అందుకే ఆలోచించి మరీ మీకు ఉత్తరం రాశాను. మీరు ఒప్పుకొంటారో ఒప్పుకోరో అని ఎంత కలవరపడ్డానో. మొత్తానికి మీ రొచ్చారు! థాంక్స్!"

వసపోసిన పిట్టలాగా గడగడ మాట్లాడేవాళ్లంటే కృష్ణమూర్తికి భయమే అయినా, ఈ క్షణంలో జ్యోతి ఇంకొంచెం సేపు మాట్లాడితే బాగుండు ననిపించింది. ఎన్నాళ్లనుంచో కథలు రాస్తున్నా, ఎన్నో ఏన్నో కథలలో ఎన్నో సన్నివేశాలు చిత్రీకరించినా కానీ, కృష్ణమూర్తికి ఈ అనుభవం కొత్తగా ఉంది. మనసంతా మత్తుగా ఉంది.

ఎవరో అమ్మాయి ఉత్తరం రాయటం, తన్ను సినిమాహాలువద్దకలుసుకోమనటం తన్ను గుర్తుపట్టటానికి వీలుగా తను కనకాంబరం రంగు బట్టలతో వస్తానని రాయటం—ఈ క్షణంలో తలుచుకుంటే అంతా తమాషాగానే కనిపిస్తోంది కానీ, పక్కనే ఉన్న జ్యోతి ఇదంతా నిజమే నని స్పష్టంగా చెబుతోంటే అబద్ధమని ఎలా అనుకోవటం?

అలా సినిమాతో మొదలయిన కథ, గ్రూప్‌సీన్‌తో ఆఖరవవలసిందే గానీ, కట్నం విషయంలో కృష్ణమూర్తి ఇంటి వాళ్లు కొంచెం గట్టిగా ఉండేసరికి కథంతా మళ్ళీ మొదలయింది. అయినా కృష్ణమూర్తి అనుకొన్న మాటమీద నిలబడి పెళ్ళికి ఎవరూ రాకపోయినా, జ్యోతి మెళ్లో తాళి కట్టాడు.

పెళ్లయాక అందరిలాగానే సంసార సాగరం ఈదటంలో మునిగిపోయినా, కృష్ణమూర్తికీ, జ్యోతికీ పెళ్ళి మునుపు ఉన్న తమ నంసారం గురించి ఆలోచించు గోవటం సరదాకో ఉండేది.

*   *   *

ఉలికిపడి లేచిన జ్యోతికి ఎవరో తలుపు తట్టటం వినిపించింది. తలంతా భారంగా వున్నా, నెమ్మదిగా లేచి తలుపు తీసింది. ఎదురుగా కృష్ణమూర్తి!

జ్యోతికి తలనొప్పి ఎక్కువయి పోయింది. పొద్దున్న ఎంతో కోపంతో వెళ్ళిపోయినా, కడుపులో ఎలకలు అటూ ఇటూ పరిగెట్టేసరికి, కృష్ణమూర్తి అలా కృష్ణంరాజైనా ఇంటికి రావల్సిందే కదా! నెమ్మదిగా కదిలి, మనసులో లేని ఓపిక తెచ్చుకొని, కంచం పెట్టింది. కృష్ణమూర్తి బట్టలు మార్చుకొని వంట ఇంట్లోకివచ్చి, కంచంముందు కూర్చు న్నాడు. జ్యోతికేసి చూశాడు. జ్యోతి అన్నం తిన్నట్లుగాలేదు. అదే అడిగాడు:

"అన్నం తిన్నావా?"

జ్యోతి జవాబివ్వలేదు.

"అన్నం తిన్నావా?" మళ్ళీ అడిగాడు కృష్ణమూర్తి.

"లేదు."

"ఏం?"

"తినాలనిలేదు."

"జ్యోతీ! ఏమిటిది, నామీద కోపం అయితే..."



"మీమీద నాకేం కోపం లేదు."

"మరెందు కీనిరహారదీక్ష?"

"నిరహారదీక్షాలేదు, నిరసనవ్రతమూ లేదు. నాకు తలనొప్పిగా ఉంది."

"లేదు జ్యోతీ, నువ్వు నన్ను..."

"అపార్థం చేసుకొన్నాను అంటారు. అదేకాక ఇంకేమన్నా కూడా, మీ మాటలు నమ్మే స్థితిలోలేను!'' అంది జ్యోతి.

"నీ ఇష్టం!" అంటూ లేచాడు కృష్ణమూర్తి అన్నం తినకుండానే. జ్యోతికి బాధకలిగింది. అన్నం తినకుండా వెళ్ళటంకూడా పర్సనల్ విషయమేమో అనుకొంది. అయినా అడిగింది: "మీరన్నదే నేనూ అంటే...నామీద కోపం ..."

కృష్ణమూర్తి నవ్వాడు: "నీమీద నాకేం కోపంలేదు."

"మరెందుకూ ఈ నిరహారదీక్ష?"

జ్యోతి ప్రశ్నకు కృష్ణమూర్తి జవా

ఇవ్వలేదు. నెమ్మదిగా జ్యోతిదగ్గరగా వెళ్ళి అన్నాడు. "జ్యోతీ, ఒకటడుగుతా చెప్పు, నన్ను నమ్ముతావా లేదా?"

జ్యోతి ఏమీ అనలేదు.

"నీ మనసేం బాగున్నట్లులేదు. అయిదు నిముషాల్లో రెడీగా ఉండు. అలా తిరిగొద్దాం!" అంటూ బయటికెళ్ళి పోయాడు కృష్ణమూర్తి.

* * *

"జ్యోతీ, ఆకలేస్తోంది అన్నం పెట్టు!" అన్నాడు కృష్ణమూర్తి, జ్యోతి బట్టలు మార్చుకొని తిరిగిరాగానే. జ్యోతి అటు కేసి కదిలింది.

"ఇంకా నీకోపం తగ్గలేదా జ్యోతీ– ఎందుకు అనవసరంగా గొడవ? పొద్దున్న ఏన్నో అనేసాను. అయాం సారీ!"

జ్యోతి నెమ్మదిగా అంది: "పొద్దున్న నేనన్నదానికి నేనూ సారీయే!"

"థాంక్స్!" — అన్నం కలుపు కొంటూ అన్నాడు కృష్ణమూర్తి. "నువ్వు అనవసరంగా హైరానా అయిపోతు న్నావు. ఏదో ఉత్తరం రాసినంత మాత్రాన..."

"ఎవరో ఏమిటి, గిరిక అనే అమ్మాయి..."

"ఔను, గిరిజే! కానీ ఆ గిరిజ అనే ఆవిడ ఎవరో నాకు తెలీదన్నది. నీకు తెలుసుగదా,"

"అయినా సరే, మీకిలా ఉత్తరాలు రావటం నా కిష్టంలేదు."

"ఎవరో ఉత్తరాలు రాస్తే దానికి నా బాధ్యతేమిటి?"

"అయినా మీరా ఉత్తరాలు చదవటం నా కిష్టంలేదు!"

"వద్దు జ్యోతీ వద్దు. అది పెద్ద శిక్ష! ఉత్తరాలు వచ్చినవి చదవకూడదనేది గొప్ప శిక్ష. నీకు తెలీదు–నువ్వు అర్థం చేసుకోలేవు. పాఠకులు రాసే ఉత్తరాలు ఎంత సంతృప్తిని కలుగజేస్తాయో..."


క్షణంసేపు జ్యోతి ఏమీ అనలేదు. ఆ తర్వాత నెమ్మదిగా అంది: "నా కెందుకో భయంగా ఉంది."

"ఎందుకు?"

"ఎందుకేమిటి? ఏమీ తెలీనట్లే అడుగుతున్నారు!" జ్యోతి కోపంగా అంది.

ఇంకో క్షణంలో తను ఏదైనా అనునయించే విధంగా అనకపోతే జ్యోతి ఏడుస్తుందనుకొన్నాడు కృష్ణమూర్తి— "నువ్వొత్త పిచ్చిదానవు. అనవసరంగా కంగారుపడటం తప్ప ఏముంది ఇందులో? మన ఇద్దరం ఒకటవటానికి కారణం నీ ఉత్తరమే, కాదనను! కానీ ఉత్తరం రాసిన ప్రతివారిని పెళ్ళిచేసుకోంటాననీ, ప్రతివారివెనకా పడతాననీ ఎలా అను కొంటున్నావ్?"

జ్యోతికి ఏడుపొచ్చింది, తమా యించుకొంటూ అంది: "ఆడదాని మనసు మీకేం అర్థం అవుతుంది?"




"నిజమే, అర్థంకాదు. అర్థమయ్యేలా చెప్పు, ఏం చెయ్యమంటావో?"

"చెప్పానుగా!"

"అలా కాదు..."

"ఔను, మీ మనసుకు నచ్చేలా చెప్పాలి కాబోలు..."

"అదికాదు జ్యోతీ, ఉత్తరం చదవనీ నన్ను, ఆ తర్వాత చింపేసుకో—"

"నేను చింపుతానని ఎప్పుడూ అన లేదు. మీరు దాన్నేదో పెద్ద సర్టిఫికేటులా జేబులో పెట్టుకొని తిరుగుతానంటే వద్దన్నా! అంతే!"

జ్యోతిమాటలకు నవ్వాడు కృష్ణ మూర్తి "నా కథలో నాకు ఇచ్చిన అందమైన సర్టిఫికేట్ వి నువ్వుండగా, ఇంకా సర్టిఫికేట్లు ఎందుకు చెప్పు! నీ ఇష్టమే కానీ...సరే, ఇక కోపం పోయి నట్లేనా, అయితే నవ్వాలి..."

"ఊఁ, నవ్వాల్సిందే..." జ్యోతి గోముగా అంది.

"నువ్వు కోపంలో చాలా బాగుం టావ్ జ్యోతీ...!"

"ఊఁ, ఇవన్నీ ఎందుకో నాకు తెలీదా ఏం? ముందు భోజనం అయితే కాని వ్వండి?"

కృష్ణమూర్తి ముందు భోజనం కాని చ్చాడు. ఆ తర్వాత చలేస్తోందని తలుపు వేశాడు.ఆ తర్వాత గదిలో వెలుగుతున్న దీపం ఆర్పడానికి స్విచ్ కేసి నడిచాడు.

—